క్లుప్తంగా

టీఎల్ఎంతో పాఠాలు బోధించాలి

ఎంఈవో సీహెచ్. రమాదేవి



ప్రత్తిపాడు: టీఎల్ఎం ద్వారా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాతమల్లాయపాలెం హైస్కూల్స్‌లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం ఎంఈవో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు ముందస్తుగా పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సిద్ధం చేసుకున్న లెస్సన్ ప్లాన్‌ల ఆధారంగా విద్యార్థులకు విద్యాబోధన సాగించాలని సూచించారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా పాఠ్యాంశాలు చెప్పడం వలన విద్యార్థులు తరగతి గదిలో చెప్పిన పాఠాలను ఎక్కువ రోజులు గుర్తుంచుకుంటారని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు భాషల పట్ల విద్యార్థులు పట్టు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం విషయంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. బడికి గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఎందుకు రావడం లేదో తెలుసుకుని డ్రాపవుట్స్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొప్పర్రులో ఇరువర్గాల ఘర్షణ

కొప్పర్రు(కాకుమాను): పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యం కొనుగోలు (తరలింపు) వ్యవహారంలో మండలంలోని కిప్పర్రు గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుల మధ్య సోమవారం అర్ధరాత్రి వివాదం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో టీడీపీకు చెందిన పార్టీ నాయకులు రేషన్ బియ్యం కొనుగోలు విషయంలో రెండు వర్గాలుగా ఏర్పడ్డాయి. గత మూడు నెలలుగా ఇవి కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇరువర్గాలకు చెందిన నాయకులు రేషన్‌బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో మరో వర్గం వారు కాపు కాసి బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగినట్లు సమాచారం. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా తమ దృష్టి ఎలాంటి సమాచారం రాలేదని వారు తెలిపారు.

ఘనంగా చేబ్రోలులో మోదీ జన్మదిన వేడుకలు



చేబ్రోలు: మండలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ దేవస్థానం సమీపంలోని సుద్దపల్లి అడ్డరోడ్డు ప్రాంతంలో బీజేపీ శ్రేణులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు దానబోయిన శివయ్య, పాలడగు శ్రీనివాసరావు, నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, మాడా శీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్ట్

తెనాలిరూరల్: వరస చోరీలకు పాల్పడుతున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చోరీ కేసుల వివరాలను ఎస్ఐ షేక్ కరిముల్లా వివరించారు. వేర్వేరు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ. 2.80 లక్షల విలువ చేసే 45 గ్రాముల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన ఒడగల పార్థసారథి అలియాస్ పార్థు చోరీలు చేస్తుంటాడు. తన స్నేహితులు కూరపాటి సంపత్, ధనావత్ హనుమనాయక్‌లతో కలసి ఇటీవలి కాలంలో చోరీలకు పాల్పడుతున్నాడు. పట్టణ చినరావూరుకు చెందిన వెంకటవాసు జూలై 11వ తేదీన అర్ధరాత్రి సమయంలో బహిర్భూమికని బయటకు రాగా అతడిని బెదిరించి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు, చేతికి ఉన్న రెండు ఉంగరాలను నిందితులు చోరీ చేసినట్లు తెలిపారు. అలానే నాజరుపేటకు చెందిన కాంతి శ్రీరామ్ ఇంట్లో నిద్రిస్తుండగా లోనికి ప్రవేశించిన వీరు బీరువాలో ఉన్న రెండు బుట్ట పోగులు అపహరించుకెళ్లారు. చెంచుపేట కెప్టెన్ యర్రంనేని విజయప్రసాద్ బజారులో వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆయా ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

పొన్నూరులో పారిశుద్ధ్య సమస్య స్థానికులను వెంటాడుతోంది. మురుగునీరు పారుదల కావల్సిన డ్రెయిన్లలో సిల్టు పేరుకుపోయి లేనిపోని సమస్యలను వారికి తెచ్చిపెడుతోంది. లక్షలు వెచ్చించి దీన్ని తొలగించామని చెబుతున్న యంత్రాంగం మాటలకు, కనిపిస్తున్న దృశ్యానికి పొంతన కుదరడం లేదు. దీంతో పాలకులపైనా, మునిసిపల్ సిబ్బందిపైనా పట్టణవాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.

లక్ష్యం వృథా.. జనం వ్యథ!



- పట్టణంలో పూర్తిస్థాయిలో జరగని పూడికతీత పనులు
- క్షీణించిన పారిశుద్ధ్యం.. డ్రెయిన్లలో కదలని చెత్త, వ్యర్థాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పొన్నూరు: పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం పడకేసింది. వార్డు స్థాయిలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాల్సిన ప్రజారోగ్య విభాగం పట్టించుకోవడం లేదు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడితే సమస్యకు పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నా, నిల్వలు చేరడంతో లక్షలు వెచ్చించాల్సిన దుస్థితి పొన్నూరు మున్సిపాలిటీలో నెలకొంది. ఓ వైపు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి విభాగాల వారీగా ఆదేశాలు జారీ చేస్తున్నా.. కిందిస్థాయి అధికారుల్లో చలనం ఉండటం లేదు. మెయిన్ డ్రెయిన్లలో పూడిక, పలు ప్రాంతాల్లో కాలువల్లో తీసిన చెత్త, వ్యర్థాలను సకాలంలో తొలగించకపోవడంతో దోమలు, ఈగల వ్యాప్తి అధికమౌతోంది. పారిశుద్ధ్యం దిగజారి రోగాలు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం

20వ వార్డులోని శాంతి నగర్ సమీపంలోని ప్రధాన డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టక పోవడంతో చెత్త, వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు నీరు పారక స్తంభించడంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు విజృంభించి వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కమిషనర్ నుంచి ఆదేశాలు అమలు చేయాల్సిన అధికారులు మాత్రం పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యంతోనే సమస్యలు వస్తున్నాయి. పారిశుద్ధ్యం పూర్తిగా దిగజారితే నష్టం తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పనులు చేయకుండానే బిల్లులా..

పట్టణంలోని మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపునకు సుమారు రూ. 35 లక్షలు కేటాయించి సిల్ట్ తొలగించినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టలేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అసలు వ్యర్థాలు తీశారా.. లేక అధికారులు వారికి కావలసిన విధంగా బిల్లులు చేసుకున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల వివరాల ప్రకారం పూర్తిస్థాయిలో పూడికతీత పనులు జరిగి ఉంటే కొద్దిపాటి వర్షానికే మురుగు కాలువలు పొంగి ప్రవహించే పరిస్థితి ఉండదు. ఇటీవల కురిసిన వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు పొంగి చెత్తాచెదారం రహదారిపైకి చేరింది. మురుగు కదలని పరిస్థితి నెలకొంది.



శాంతి నగర్ డ్రెయిన్‌లో చెత్త, వ్యర్థాలు

రూ. 35 లక్షలతో సిల్ట్ తొలగింపు



పట్టణంలోని 31 వార్డులలో మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు పూర్తయింది. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రత్యేక నిధులు రూ. 35 లక్షలతో డ్రెయిన్లలో సిల్ట్‌ను తొలగించాం. మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పూడికను తొలగించి సమస్యను పరిష్కరించాం.

ఏడుకొండలు, డీఈ, పొన్నూరు మునిసిపాలిటీ

చేబ్రోలులో ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో (దిశ) చైల్డ్ ఫండ్ ఇండియా -లింక్ వర్కర్ స్కీం ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా మంగళవారం హెచ్ఐవీ ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ అనేది అంటు వ్యాధి కాదని ఇది కేవలం సురక్షితం కానీ లైంగిక సంబంధాల వల్ల వస్తుందన్నారు. అలాగే కలుషితమైన సూదులు, సిరంజీ వలన, కలుషితమైన రక్తమార్పిడి వల్ల హెచ్ఐవీతో ఉన్నటువంటి తల్లి నుండి పుట్టబోయే బిడ్డకు వస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరు హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 'కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీదేవి, ఎస్ఎస్ పీవో పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ పై కరపత్రాలు పంపిణీ చేశారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేతేపల్లి గాయత్రికి యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసింది. '' యాన్ ఎంపిరికల్ స్టడీ ఆన్ డీప్ లెర్నింగ్ బేస్డ్ ఎన్‌సెంబుల్ క్లాసిఫైర్స్ ఫర్ నెట్‌వర్క్ అనోమలీ డిటెక్షన్'' అనే అంశంపై పరిశోధన చేసింది. పీహెచ్‌డీ పట్టా పొందిన కేతేపల్లి గాయత్రిని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ అభినందించారు.

అనుబంధ పోషకాహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతదేవి



మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సుజాతదేవి

ప్రత్తిపాడు: అనుబంధ పోషకాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి.సుజాతదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని కుమ్మరపాలెం అంగన్‌వాడీ కేంద్రం, తూర్పు పాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న పోషకాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో సుజాతదేవి మాట్లాడుతూ చిన్నారులకు ఏడవ నెల వచ్చిన తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ అహారాన్ని అందించాలన్నారు. ఆరు నుండి ఎనిమిది నెలల పిల్లలకు గోరు వెచ్చని నీరు లేదా పాలలో బాలామృతం కలిపి జావలాగా, 9–12 చిన్నారులకు లడ్డూల్లాగా తినిపించాలన్నారు. ఒకటి నుండి మూడు సంవత్సరాల చిన్నారులకు రోజుకు వంద గ్రాముల చొప్పున దోసెలు, చపాతీలుగా చేసి తినిపించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో విజయనిర్మల, సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్. భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ. వెంకాయమ్మ, డి. కనకమ్మ, తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత

ఇన్‌చార్జి ఏపీవో షేక్ మస్తాన్‌వలి



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి సర్పంచ్ కుమారి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా

ప్రత్తిపాడు: మొక్కల సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో షేక్ మస్తాన్‌వలి అన్నారు. ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ప్రత్తిపాడు, యనమదల, తిక్కిరెడ్డిపాలెం, వంగిపురం, గొట్టిపాడు, గనికపూడి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు రక్షిత మంచినీటి చెరువు కట్టలు, రహదారుల వెంట ఉపాధి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ మొక్కలను విరివిగా పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. మొక్కలను నాటి వదిలేయడం కాకుండా అవి పెరిగి పెద్దవి అయ్యే వరకూ వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పాలెపు కుమారి, జి. ఆదినారాయణ, షేక్ మహమ్మద్, పి. మరియరాణి, శిఖా విజయలక్ష్మి, ఎం. జగన్‌మోహన్, సెక్రటరీలు పాల్గొన్నారు.

స్వచ్ఛ పొన్నూరులో భాగస్వాములు కావాలి

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



కార్యాలయ ఆవరణ శుభ్రపరుస్తున్న అధికారులు, కార్మికులు



ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న మేనేజర్ అజిత కుమారి



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో ఆదినారాయణ



చేబ్రోలులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీవో బాబురావు

పొన్నూరు: పట్టణంలోని 31 వార్డులలో సకాలంలో చెత్తచెదారాలను తొలగించి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అధికారులు, నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కార్యాలయ ఆవరణను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్మికుల ఆరోగ్యభద్రత, వారికి కావలసిన సౌకర్యాలు అందించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2 వరకు జరిగే ఈ కార్యక్రమంలో స్వచ్ఛతను ఒక జీవన విధానంగా భావించి ముందుకు సాగాలని పేర్కొన్నారు. పరిశుభ్రతను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

పొన్నూరు ఆర్టీసీ డిపోలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని డిపో మేనేజరు టి. అజిత కుమారి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి డిపోలో ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పాలని సిబ్బందికి సూచించి ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలి

ప్రత్తిపాడు: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో డి. రామకోటయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అన్నమ్మ హాజరయ్యారు. తొలుత పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరపాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా మాట్లాడుతూ 'స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత' నినాదంతో ప్రతి గ్రామంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డబ్బారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఇతర శాఖల ఉద్యోగులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. తదనంతరం సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, వెలుగు సిబ్బంది కలిసి మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్, పీఆర్ ఏఈ రవీంద్రరెడ్డి, ఎంఈవో సీహెచ్. రమాదేవి, ఏవో అరుణకుమయారి హెచ్‌వో బేబి, వెటర్నరీ అధికారులు, ఐటీసీ–ఫినిష్ సొసైటీ, వాటర్ ఎయిడ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత సేవలో అందరూ పాలుపంచుకోవాలి

చేబ్రోలు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక జీబీసీ రహదారిపై మానవహారంగా మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో బి.బాబురావు మాట్లాడుతూ పారిశుద్ధ్యాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా చేయాలనిపిలుపునిచ్చారు. మూడు అంశాల నేపథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవో పీఆర్‌అండ్‌ఆర్‌డీ జి. శ్రీనివాసరావు, చేబ్రోలు గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మైలా రామరాజు, మండల పరిషత్, గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులునాయుడుపాలెంలో..

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఓబులునాయుడుపాలెం గ్రామంలో స్వచ్ఛతా హై సేవా, తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి జె.యమున, ఎమ్ఈవో ఖుద్దుస్, గ్రామ సచివాలయం ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత సమస్య

- గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్
- ప్రత్తిపాడులో డీఐవో ఆకస్మిక తనిఖీ



పెదగొట్టిపాడు హైస్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ మేరియునిస్



పరిశుభ్రతపై విద్యార్థులకు వివరిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు



యనమదలలో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్



రక్త హీనతపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న పోసమ్మ కుమారి

ప్రత్తిపాడు: నులిపురుగులతో రక్తహీనత సమస్య ఉత్పన్నమవుతుందని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్, యనమదల హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో డాక్టర్ హేమంత్, తుమ్మలపాలెం యూపీ పాఠశాలలో పీహెచ్ఎస్ నిర్మలాదేవి, ఈదులపాలెం ఆర్‌సీఎం పాఠశాలల్లో ఎంపీహెచ్ఈవో చెల్లమ్మలు మధ్యాహ్న భోజనం తరువాత విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరి యునిస్ మాట్లాడుతూ నులిపురుగులతో అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో 2,761 మంది విద్యార్థులుండగా, వారిలో 2,676 మందితో మాత్రలు మింగించడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీహెచ్ఎస్ విజయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం..

విద్యార్థులు భోజనం తినేముందు చేతులను శుభ్రపరుచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు అన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అనంతరం చేతులను ఎలా పరిశుభ్రం చేసుకోవాలో విద్యార్థులకు వివరించారు. వెంట సీహెచ్‌వో స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన ఉండాలి

కొల్లర్ల(కాకుమాను): గర్భధారణ సమయంలో మహిళలు రక్త హీనత లోపించ కుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ పాండ్రపాడు సూపర్‌వైజర్ పోసమ్మ కుమారి అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొల్లిమర్ల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణీ,బాలింతలకు రక్త హీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోసమ్మ కుమారి మాట్లాడుతూ గర్భిణీ సమయంలో తప్పని సరిగా మహిళలకు మంచి పోషక విలువలు కలిగిప ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే తల్లీ,శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు,గర్భిణీలు,బాలింతలు,పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



జీవామృతం తయారీపై వివరిస్తున్న విద్యార్థులు

వల్లభాపురం(కొల్లిపర): రైతులు ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తే, తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించటమే కాకుండా ఆహార ధాన్యాలు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటాయని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు రైతులకు వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విజ్ఞాన విభాగం ద్వారా 2024–25 గ్రామీణ అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మంగళవారం మండలంలోని వల్లభాపురంలోని రైతులకు మొక్కల పెంపకానికి సహజ పద్ధతులు, ధ్రువ జీవామృతం తయారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వలన రసాయనాల వాడకం ఉండదని చెప్పారు. జీవామృతం కషాయాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వివిధ పంటలో చీడపీడల నివారణకు జీవామృతం వినియోగించాలని సూచించారు. ధ్రువ జీవామృతం పంటల్లో జీవన ఎరువుగా వాడాలని చెప్పారు. జీవామృతాన్ని పాలు, పెరుగు, వేరుశనగ, గోవు మూత్రం వంటి సహజ పదార్థాలతో రైతులు తమ ఇంటి వద్దనే ఏ విధంగా తయారు చేసుకోవాలని అన్న విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం 4వ సంవత్సరం విద్యార్థినులు ఎస్.కావ్య శ్రీ, బీవీఎస్ కావ్య, బి.నక్షత్ర, ఎ.మధులత, ఎం.లోకేశ్వరి, వై.శ్రీహిత, అజ్మీరా, జమేరియా, ఎల్.హేమ, వి.తేజశ్రీ,పాల్గొన్నారు.

పేకాటాడుతున్న 8 మంది అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో పొలాల్లో ఒక భవనంలో రహస్యంగా పేకాటాడుతున్న 8 మందిని ఎస్ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాటాడుతున్న 8 మంది వద్ద నుంచి రూ.15,220, 4 మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.